దశరూపకం

భమిడిపాటి కామేశ్వరరావు

౧

మందపిల్లి,
౧౯-౧౧-౩౮.

రసరాట్టుగారికి నమస్కారములు—

మహాశయా! నాన్నగారు మా తోటారం భూములమీదికి శిస్తువసూలు వగైరాలకి వెళ్లారు. పదిరోజులక్రితం తమపేరట ఒక వచనరచన పంపిఉన్నాను. మరి ఆలస్యం కానీయక దానిమీద తమ సదభిప్రాయం పంపండి. తిరుగుటపాలో పంపాలి.

ఇట్లు,
గోపీనాథం.

జ బా బు

వేరారం,
౨౦-౧౧-౩౮.

గోపీనాథానికి ఆశీర్వచనాలు —

అబ్బాయీ! ఎదో ఆలస్యం అయింది. ఏమీ అనుకోకు. నాకు మీ నాన్నగా రొకటీ నువ్వొకటీ కాదు. ఇదుగో:

ఈగ్రంథం ఆంధ్రానికి ఒకఆస్తి. అక్కడక్కడ దీంట్లో మామూలుదోషాలు లేక పోలేదు కాని, కొన్నిపట్ల ఇది ఎంతో హృద్యంగా ఉంది. ఇటీవలిదిన్నీ మాండలిక మున్నూ అయిన పోతభాష వాడితే నేం పోమె, చేతభాషకూడా పాళంగానే పడింది. అతితెలివిసంకరసమాసాలు బలే విరివిగానూ మహాజోరుగానూ లేవని చెప్పలేంకాని, జటిలత్వం నిండుకుంది అనడానికీ వీలులేదు. పాండిత్యంలో లోటుకీ కథలోని నీటుకీ ఉర్జీ సరిపోయింది. ఇది ఉత్తమోత్తమం అని వ్రాయజాలం కాని, దీన్ని నీచకావ్యంఅని కొట్టి పారెయ్యడానికీ మనస్కరించకుండా ఉంది. మొదలు ఎట్లా ఉందో చివరంటా అంతే.

ఇట్లు,
రసరాట్.

౨

మందపిల్లి,
౨౧-౧౧-౩౮.

రసరాట్టుగారికి నమస్కృతులు—.

ఆర్యా! తమజబాబు చేరింది. క్షమించవలె. మొన్న నేను తమకు వ్రాసిన ఉత్తరం పొరపాటు. తమకు ఆరచన పంపినట్టుగా జ్ఞాపకముండి అట్లా రాశాను. ఈవేళ తీరా చాకలితెచ్చిన కోటు తొడుక్కోగా, నా కోటు జేబులోనే ఆరచనకూడా ఇస్త్రీఅయి ఉండిపోయింది. ఇప్పుడే వేరొకకవర్లో పెట్టి ఆరచన మీకు పంపాను. ఆకాగితాలు విప్పేటప్పుడు జాగ్రత్త. నామీద దయ ఉంచి మంచి అభిప్రాయం పంపండి.

ఇట్లు,
గోపి.

జ బా బు

పేరారం,

౨౨-౧౧-౩౮.

గోపీ! మరొకరికి పంపవలిసిన ఉత్తరం నీకు వేశాను. నువ్వు కొంచెం అసాధ్యపు పిల్లకాయలా ఉన్నావు. నువ్వు కవిత్వం కూడా రాస్తా వని లోగడ నే నెరగను. ఇదిగో:

ఈకవి సుప్రసిద్ధపండితపుత్రుడు. ఇతి వృత్తం ఒక మహాపురాణంలో అసలైనపట్టు. కాని, ఈరచనలో అనుభవం తక్కువ. ఆ వేశానికి తుల్యమైన ఆరిందా లేకపోడం సహ జంగనక లేదు. ఉంటే అడిగారూ! ఉన్న తప్పులు కుర్రతప్పులు గనక క్షమించవచ్చు. ఈకవికి భవిష్యంలో మంచి విలవ వస్తుంది. ఇప్పుడైనా, రచన నవనవోన్మేషం, మహ మెత్తనిశయ్య, పరిశుభ్రమైన ధార. పాండి త్యంలో కనబడేలోటుకుడా కాలక్రమాన్ని, అన్నీ సర్దుకున్నట్టే, సర్దుకుంటుంది. మాంచి అక్కరకొచ్చే చెయ్యి, సవ్యసాచి. భరత మాతకి ఇల్లాంటి సంతానం అవసరం.

ఇట్లు,

రసరాట్.

౩

మందపిల్లి,

౨౩-౧౧-౩౮.

రసరాట్టుగారికి వందనాలు. తమజాబు అందింది. ఆరచన నాది కాదు. సలాం.

ఇట్లు,

గోపి.

జ బా బు

పేరారం,

౨౪-౧౧-౩౮

గోపీ! ను వ్వింకా ఏముటో అనుకు న్నాను. తగ్గవాడివే. ముత్తంమీద చణక శాస్త్రుల్లుగారి అబ్బాయి ననిపిస్తున్నావ్. ఆ రచన చెయ్యడంపాటి తెలివితేటలు నీదగ్గిర లేకపోతే పోనీ అది ఎవరు రాశారో ఆసంగ తేనా నాకు రాయవలిసిఉంటుం దనేనా నీకు ఇంగితజ్ఞానం ఉండకూడదూ! ఇదుగో:

ఈరచన మంచిది. భాష చక్కనిది. వస్తువు అందమైనది. రీతి కులాసాగా ఉంది. వృత్తి గౌరవముకలది. ఈకవికి హిందూస్తానీ కుడా తెలుసు. వెల స్వల్పం. ఫల మధికం, చక్కనిసైజు.

ఇట్లు,

రసరాట్.

౪

మందపిల్లి,

౨౫-౧౧-౩౮.

ఆర్యా! మా నాన్నగారు గ్రామాంత రం వెళ్లేటప్పుడు ఈ రచనమీద అభిప్రాయం కోసం ఇది మీపేర పంపించమని నాతో చెప్పారు. అన్నట్టు, మీరు వారికి బాకీఉన్న లెఖ్ఖగురించి వ్రాయమనికూడా అని వెళ్లారు.

ఇట్లు,

గోపి.

జ బా బు

పేరారం,

౨౬-౧౧-౩౮.

గోపీ! అల్లా చెప్పుమరీ! అందుకనే, ఈ రచన మిక్కిలి ఉత్కృష్టం. కవి కేవలఛాం

దసుడు కాడు. ఒకటోరకమైన చాదస్తంలా పైకి కనిపించేది యావత్తూ ఫక్తు చేవ, గుంజు. ఇందులో అపారపాండిత్యం గంగాతరంగాల వంటి నిమ్నోన్నతభావాలలో చదువర్ని ముంచి లేవనెత్తుతుంది. పాండిత్యం ఇంత సద్వినియోగం చేసినవాళ్లు లేరు. ప్రాచీన సంప్రదాయం ఇక్కడే నిల్చింది. మారుమూల పదాలకి ఈరచన కాణాచి, అపరూపకారకాలకి ఈరచన దిక్కు, పురాణేతిహాసాలకి ఈరచన ధర్మసత్రం. నేలబారు రోకలిబండలు ఎగర్లేని మహోన్నత కవితాగిరిశిఖరాలలోనే ఈకవివాణి విహరిస్తుంది. గ్రహించే బుర్ర లుండాలిగాని, నవీనవిజ్ఞానం అనబడేది కూడా చణకశాస్త్రిగారి యీక్రొత్త రచనలో ఉంది. నాడీ పూచీ!

ఇట్లు,
రసరాట్.

౫

మందపిల్లి,
౨౭-౧౧-౩౮.

అయ్యా, రసరాట్టుగారూ! తమజాబు అందింది. మానాన్నగారు కవిత్వం రచించగలరని మాకు తెలియదు. ఈరచన ఆయనది కాదేమో! అయినా, నమస్కారం.

ఇట్లు,
గోపి.

జ బా బు

వేరారం,
౨౮-౧౧-౩౮.

గోపీ! ఇహనేమ్మరీ! నేను అప్పుడే అనుకున్నాను. అందుకనే ఈరచన రమ్యంగానూ గంభీరంగానూమాత్రం ఉంది. శైలి మృదుమధురంగానూ, ప్రాయశః భయజనకంగానూ, సర్వత్రా న తికతినపదభూయిష్ఠంగానూ ఉంది. కవి ఇటువంటి రచనలు ఇంకా మేట్లు కొలది రాసి, బతికుండగానే అచ్చుకొట్టి, చచ్చోచెడో అందరికీ ఉచితరీతిని వాటిని అందజేసి ధన్యుడై తరించునుగాక.

ఇట్లు,
రసరాట్.

౬

మందపిల్లి,
౨౯-౧౧-౩౮.

రసరాట్టుగారూ! ఇంతటితో ఊరుకుందాం అంటే వీల్లేనిపరిస్థితి ఏర్పడ్డది. నిన్న మాయింటికి నే లేనప్పుడు ఒకాయన మా నాన్నగారికోసం వచ్చారని మా అమ్మ చెప్పింది. ఆయన తాలూకు ఒకరచనమీద అభిప్రాయం తెప్పించి యిస్తానని మానాన్నగారు వారికి వాగ్దానంచేసి రచన పుచ్చుకున్నారుట. ఆయనపేరు తెలియదు. చూపులకి కొత్తపంఫిణీ బియ్యేలా ఊరుకున్నాడని మాఅమ్మ అంది. మీకు నేను పంపింది ఆయన రచనేమో!

ఇట్లు,
గోపి.

జ బా బు

వేరారం,
౩౦-౧౧-౩౮.

గోపీ! అసలు నేను మొదట్లోనే అల్లా అనుకున్నాను. ఈకవి ఇంగ్లీషులు చదివినవాడు. ఇంగ్లీషులో తను చదువుకున్నదంతా మక్కికిమక్కి ఇందులో ఫొటోగ్రాఫు దింపేశాడు. ఈసరుకు ఎక్కణ్ణించి దిగుమతీ చేస్తున్నాడో చెప్పడు. ఆసంగతి తెలుగుఘటాలు ఎక్కడ కనిపెట్టొచ్చారని ఇతనిఊహ. రచ

నంతా ఇంగ్లీషుకంపే. ఉద్బోధనగాని ఉత్తేజనగాని ఇందులో లేవనడం సాహసం. భాష మాత్రం ఆంగ్లాంధ్రద్రావిడవంగ ధప్పళం.

ఇట్లు,
రసరాట్.

౭

మందపిల్లి,
౧-౧౨-౩౮.

రసరాట్టుగారూ! మీపేర వ్రాయడం ఏ ముహూర్తాన్ని ప్రారంభించానో గాని సంగతి తెమిలేటట్టు కనపడదు. మరోచి క్కొచ్చింది. పొద్దున్న ఒకాయన నే ఉండగానే మాయింటికొచ్చారు. ఆయనపేరు ఘంటారావుట. ఆయనట తనరచన మానాన్న కిచ్చింది. మీకు నేను పంపినరచన తనదేనని ఆయన పట్టుపడుతున్నాడు. వెనక మీఎన్నికల్లో మీతరఫున పనిచేసింది ఈయనేట.

ఇట్లు,
గోపి.

జ బా బు

పేరారం,
౨-౧౨-౩౮.

అబ్బాయి, గోపీనాథం! అల్లా చెప్పమరీ! అందుకనే తీవ్రంగా చూసినమీదట ఈరచన కడుంగడు ప్రౌఢంగా ఉంది. కొన్ని స్ఖాలిత్యా లున్నాయి. ఉంటే ఏంఅన్నాను! కొన్ని స్ఖాలిత్యాలు ఉండాలి అనికూడా నేను వాదిస్తాను. లేకపోతే రచన మానుషమే అనిపించుకోదు. ఇది యథార్థభావాలతోనూ, ఉన్నతాదర్శాలతోనూ నిండి ఉంది. రసం ఇందులో కేవలం ఆవకాయి ఊటలాగ ఊరిపోవడమే కాకుండా సముద్రపు పోటులాగ ఉబ్బి మీద పడిపోతోంది. భాష అతిమధురం. శైలి మనోహరం. వట్టివేళ్లయొక్క చల్లదనం, వనసంతర్పణపోపుయొక్క ఘుమఘుమ, చలిమిడియొక్క పాకం ఏకకాలంలో ఇక్కడ దొరుకుతాయి. వేయేల? ఈరచనలోని మాటలు అన్నజిహ్వే జిహ్వ, విన్నచవే చెవి, తస్కరించినకవే కవి.

ఇట్లు,
రసరాట్.

౮

మందపల్లి,
౩-౧౨-౩౮.

రసరాట్టుగారూ! శాస్త్రం చెప్పిన తరవాయిగా వచ్చింది. ఎప్పటికప్పుడు మీతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం కట్టేద్దాం అనుకుంటూండడం, ఏదో పిల్లసమ్మేరీ వస్తూండడం జరుగుతోంది. మీ రేమన్నా అనుకుంటారేమో అని ఇదవుతున్నానుకుడానూ! ఈవేళ మరోఆయన వచ్చాడు. ఇతగాడిపేరు కేతయ్యట. ఆయనకూడా మానాన్నగారిచేతికి అభిప్రాయంనిమిత్తం తన రచన ఇచ్చాట్ట. మా నాన్న ఊళ్లో లేరని చెప్పేసి మెల్లిగా ఆయన్ని వొదిలించుకున్నాను. ఘంటారావురచనమీద అభిప్రాయం నిన్న మరొకరిదగ్గిర్నించి నాకు వచ్చేసింది. మీ దగ్గిరున్న రచన కేతయ్యదే. ఎదో ప్రసంగం వచ్చి, మీకూ తనకీ పచ్చగడ్డేస్తే భగ్గుమంటుందని కేతయ్య అన్నాడు.

ఇట్లు,
గోపి.

జ బా బు

వేరారం,

౪-౧౨-౩౮.

గోపీ! ఈసంగతి రాశావు నయమే. ఇంకా దాచుగుని ఊరుకున్నావుకావు, చచ్చిపోదుం. నాకూ అనిపించింది, ఏమిరా! కొన్నిలక్షణాలు ప్రశంసార్హంగా కనిపిస్తూ ఉన్నా, ఈరచన మొత్తంమీద ఏడిసినట్టుందేమిటి అని. అల్లా అనిపించడానికి కారణం ఇప్పుడు బోధపడ్డది.

ఇంత దరిద్రగొట్టురచన భూమిమీద గాని, అంగారకుడులోగాని లేదు. బుద్ధిగల వాడెవడూ ఇది చివరంటా చదవడు. అందుకనే నే చదవలేదు. ఇందులో, గాఢంగా చూస్తే, అర్థం వ్యర్థం, భావం అభావం, రసం నీరసం, శైలి గాలి, భాష ఘోష, రీతి కోతి, వృత్తి మిత్తి, శయ్య కొయ్య, ధార నార. కొన్నిపట్ల కవి ఏడవబోయాడు. ఆ ఏడుపు ఉచితరీతిగా—అనగా, ఏడుపు ఏరీతిగా ఉండాలో అల్లా లేదు. నన్నడిగితే నేనేనా చెబుదును. చాలా బేస్థలాల్లోకుడా నవ్వు తెప్పించడానికి ప్రయత్నించి రచయిత చచ్చిచెడ్డాడు. నేనెంత బిగపట్టుగుని కూర్చున్నా ప్రాణంమీదికొచ్చిందిగాని నవ్వు రాలేదు. సహజమైన మాటపొందికా సమయస్ఫూర్తీ ఇందులో మృగ్యం. రచననీ, రచయితనీ వేరువేరుగా పుతాలేసినా ఈరచన యింతే. నుడికారం సుడిలోపడింది, కారకం మారకం చెందింది. నాబోటి గొప్పవాళ్లనీ కొన్ని గొప్పసంస్థల్నీ నిరసించడం తప్ప ఇతరం ఏమీ ఇందులో లేదు. ఈరచనలో కొంత-చివరదాకా అసలే చదవలేకపోయాను! - చదివి నేను చాలా పాడైపోయాను. నే కాక తక్కినవాళ్లు చదివితే ఎక్కడ చెడిపోతారో అని బెంగతో తీసుగుంటున్నాను. ఇది ఎవరేనా చదివితే పెద్ద ఒట్టు! జాగర్త!

ఇట్లు,

రసరాట్.

౬

మందపల్లి,

౫-౧౨-౩౮.

రసరాట్టుగారూ! క్షమించాలి. మా నాన్నగారు ఉత్తరం రాశారు. రేపో నేడో ఇక్కడికి వచ్చేస్తార్ట. ఒక పని జరిగిందిట. నాలుగైదు రచనలు మా నాన్నగారు తమ బోంట్లకి విడివిడిగా అభిప్రాయంకోసం పంపించారట. అందులో ఒకటి శ్రీనాధుడి రచన కూడా ఉందిట. కడం అభిప్రాయాలన్నీ వచ్చేశాయి. ఒకవేళ, దిక్కుమాలి ప్రాలుద్ధం, మీకు నే పంపింది అదే కావచ్చు!

ఇట్లు,

గోపి.

జ బా బు

వేరారం,

౬-౧౨-౩౮.

గోపీ! అదా కమామీషూ! హారి! చెప్పవేం మరీ! అందుకనే, కిందనమాటు నేనెంత ఏకుతూరాసినట్టు ఉన్నా, అప్పుడు కూడా ఈ రచనలోని ఆ రసస్ఫూర్తీ, ఆ పదసౌష్ఠవమూ, ఆ భావవిశేషమూ, ఆ గుజ్జుపునడకా, ఆ భాషామేళవం, ఆ వగైరాలూ—అవన్నీ తొంగిచూస్తూనే ఉన్నాయి. పెద్దవాళ్ల రచనలు అనేకం ఇతరుల చేతుల్లో పడి పాడైపోయాయి.

ఇట్లు,

రసరాట్.

౧౦ జ బా బు

మందపిల్లి,

౭-౧౨-౩౮.

రసరాట్టుగారూ! నాన్నగారు వచ్చారు. మీారు ఏమీా అనుకోకుండా ఉంటే మీాకు ఒక సంగతి రాసేసి ఇక్కడితో ఊరుకోమన్నారు. మీాపేర నేను పంపిన రచన ఒక పుష్కరంక్రితం మీారే రచించిందిట. అది మీా రచనలో కల్లా గొప్పదనేఆప్యాయంకొద్దీ నాన్నగారు స్వహస్తంతో లిఖించి, ఆకాగితం తనదగ్గిర అట్టేపెట్టుగున్నారట. నేను పంపిన రచన అదే అయిఉంటుం దని చెప్పారు. క్షమించండి.

ఇట్లు,

గోపీనాథం.

పేరారం,

౮-౧౨-౩౮.

గోపీనాథానికి అనేక ఆశీర్వచనాలు. నేనూ ఊరెల్లి ఈ ఉదయమే వచ్చాను. లోగడ నీకు వచ్చిఉన్న జాబులన్నీ, నేను ఊళ్లో లేకపోబట్టి మా అమ్మాయి రాసింది. జాబుల్లో ఉన్న వృత్తాంతం యావత్తూ, నువ్వు పంపించిన కాగితాలమీాద రాసిఉన్నదే. ఆ రచనా, దస్తూరీకూడా మీా నాన్నగారిదే. అందులో వారు విమర్శనమోనాలు రాసి అట్టే పెట్టుగున్నారు. అది పొరపాట్న ఇక్కడికి వచ్చింది. నా రచన అన్నావే! అది కుంభయ్యగారిచేతికి నిరుడు మీా నాన్నే యిచ్చారు, జ్ఞాపకం చేసుగోమను. అయితే నీకు పెండ్లి అయిందా?......

ఇట్లు,

రసరాట్.